

గెలుపెవరిదీ !

గెలిచేది ఆ పార్టీనే.. లక్ష బెట్టు.. కాదు, అభివృద్ధి కోసం ఆ నేతకే జనం మద్దతుగా నిలిచారు. విజయం వారిదే.. ఆ ఎంపీ సీటు పలానా పార్టీదే.. మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లో నడిచేది ఆ నాయకుల గాలే..

- ఎలక్షన్ కౌంటింగ్ వేళ జోరుగా బెట్టింగులు
- ప్రముఖులు నిలుచున్న చోట్లపై అమితాసక్తి
- ఎక్కడ చూసినా విజయం ఎవరిని వరిస్తుందన్న చర్చే

పెద్దఅంబర్‌పేట, జూన్ 2 : బెట్టింగ్.. బెట్టింగ్.. బెట్టింగ్.. రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంటు ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్‌లోని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్ నడుస్తున్నది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై భారీ బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఎక్కడ చూసినా బెట్టింగ్‌లపైనే చర్చ నడుస్తున్నది. తమ అభిమాన నాయకుడే గెలుస్తాడని కొందరు, లేదు తమ అభిమాన నేతకే జనం పట్టం కడతారని మరికొందరు పందేలకు దిగుతున్నారు. 'అన్న రూ.50 వేలు పెట్టిన.. ఆ పార్టీ గెలిస్తే రూ.లక్ష వొస్తదే' గెలుస్తట్టున్నమా అని ఆరా తీస్తున్నారు. 'కాక.. అప్పటికి ఇప్పటికి ఏమైనా మారిందా? మారితె చెప్పే.. ఆ పార్టీ మీద ఇంకో లక్ష ఏస్త' ఇప్పటికే పందెం కాసిన డబ్బు పోకుండా ప్రత్యర్థి పార్టీపై బెట్టింగ్ పెట్టేందుకు సిద్ధమై విశ్లేషణలు చేస్తున్నవారూ కనిపిస్తున్నారు.

ఎన్నికల ముందు నుంచే..

ఎన్నికల నిర్వహణకు రెండు నెలల ముందు నుంచే బెట్టింగ్‌లు మొదలయ్యాయి. ఏపీలో అధికారంలో ఉన్న పార్టీనే మళ్లీ పీఠం దక్కించుకుంటుందని రూ.50 వేలు పెడితే.. కౌంటింగ్ తర్వాత అంతకు రెట్టింపుగా అంటే రూ.లక్ష వచ్చేలా పందేలు కాశారు. లేదు కూటమి పార్టీ గెలుస్తుందని ఇంకొందరు బెట్టింగ్‌లు పెట్టారు. అందుకోసం ముఖ్యమైన నియోజకవర్గాల్లో పోలింగ్ సరళి, ఓటింగ్ శాతం పెరిగిందా? తగ్గిందా? తగ్గితే ఎవరికి నష్టం? పెరిగితే ఎవరికి కలిసొస్తుంది ఇలా అన్ని రకాల లెక్కలు వేసుకుంటున్నారు. ఏ నేత ఎవరితో కలిశారు, అది ఎలా లాభం చేకూరుతుందో ఎవరికి వారే విశ్లేషణలు చేసుకున్నారు. ఏపీలో తమకు తెలిసిన వారికి ఫోన్‌లు చేస్తూ, గెలుపోటములపై చర్చలు నడిపిస్తూనే ఉన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతోపాటు హైదరాబాద్ శివారులోని పలు నియోజకవర్గాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ఓటేసేందుకు ఏపీకి తరలివెళ్లారు. ఈ ఓటరు ఏ పార్టీకి ఓటు వేస్తాడు? అన్న సందేహాన్ని తీర్చుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేశారు. ఓటేసి వచ్చిన తెలిసినవాళ్లందరినీ పార్టీల గెలుపోటములపై వాకబు చేశారు.

ఎంపీ ఎన్నికలపై ఆసక్తి తక్కువే..

రాష్ట్రంలో ఎంపీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గత ఎన్నికలతో పోలిస్తే అన్ని పార్టీల ప్రచారం కూడా కొంచెం తక్కువే జరిగింది. ఎన్నికలకు వారం ముందే ప్రచారం వేడెక్కింది. ఆ తర్వాత ఎన్నికలు జరిగినా.. ఈ ఎలక్షన్స్‌పై బెట్టింగులు తక్కువే అని చెప్పాలి. రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన నేతలు పోటీలో ఉన్న పార్లమెంటు నియోజకవర్గాలపై కొందరు బెట్టింగులు పెట్టారు. తమ పార్టీ అభ్యర్థులే గెలుస్తారని దీమాతో పందేలకు దిగారు. ఎమ్మెల్యే ఎన్నికలతో పోలిస్తే పార్లమెంటు ఎన్నికల్లో ఈ ప్రభావం, జోరు తక్కువే అని చెప్పాలి.

ప్రముఖులు పోటీ చేసిన వాటిపై..

మున్సిపాలిటీ ప్రజలే కాదు, జిల్లాలోని చాలామంది ఏపీలోని పలు నియోజకవర్గాల్లో ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హాట్ టాపిక్ అయిన, ప్రధాన అభ్యర్థులు, ప్రముఖులు పోటీ చేసిన చాలా నియోజకవర్గాలపై ఇక్కడ పల్లెల్లోనూ బెట్టింగులకు దిగుతున్నారు. 'అన్నా.. ఏమంటవే. ఏది గెలుస్తది. బెట్టు కట్టిన.. వొస్తయంటవా పైసల్' అంటూ తెలిసినోళ్లకు ఫోన్‌లు చేసి ఆరా తీస్తున్నారు. మరికొందరు టీవీలో చర్చలు, యూట్యూబుల్లో విశ్లేషణలు తదేకంగా చూసేస్తున్నారు. సర్వేల్లో ఫలితాల కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. అందులో ముఖ్యంగా ప్రముఖ హీరో పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం, హీరో బాలకృష్ణ బరిలో నిలిచిన హిందూపురం, టీడీపీ అధినేత కొడుకు లోకేష్ పోటీ చేసిన మంగళగిరి, కుప్పం, పులివెందుల, కడప ఇలా మరెన్నో నియోజకవర్గాల్లో ఫలితాలపై ఆసక్తిగా ఉన్నారు. అక్కడ ఎవరు గెలుస్తారు, ఎంత మెజారిటీ వస్తుంది, ఎలా సాధ్యమైంది ఇలా పలు అంశాలపై విశ్లేషణలు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో గెలుపోటములపైనా ఇక్కడ బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఈ బెట్టింగుల ఫలితాలకు మరో రెండు రోజుల్లో ఫుల్‌స్టాప్ పడనున్నది.

కాంగ్రెస్ చీకట్లపై.. జనాగ్రహం

అర్ధరాత్రి నగరంలో చీకట్లు

గంటల తరబడి విద్యుత్ అంతరాయం

అంధకారం, ఉక్కపోత.. గ్రేటర్‌లో నిత్యకృత్యంగా మారిన కరెంటు కోతలు

తట్టుకోలేక సబ్ స్టేషన్ల ముట్టడి

సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో అర్ధరాత్రి అంధకారం అలుముకుంటున్నది. అసలే మండే ఎండలతో పగలంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగర వాసులు.. అర్ధరాత్రి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోత తట్టుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీల వాసులంతా ఒక్కసారిగా ఇండ్లనుంచి బయటకు వచ్చి.. అర్ధరాత్రి అసహనంతో ఏకంగా విద్యుత్ సబ్ స్టేషన్‌లకు వెళ్లి ఆందోళనలు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

రాత్రి 10:30 నుంచి 3గంటల పాటు..

బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ల పరిధిలో శుక్రవారం రాత్రి 10:30 నుంచి సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తీవ్ర అసహనానికి గురైన సాయినగర్, ఇంద్రానగర్, ప్రగతి నగర్‌లోని జీపీఆర్ లేఅవుట్ కాలనీలకు చెందిన ప్రజలు అర్ధరాత్రి సబ్‌స్టేషన్ ముందు బైఠాయించారు. విద్యుత్ అధికారులకు, ఏఈకి వ్యతిరేకంగా నినాదా0లు చేశారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏఈ డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కరెంటు కోతలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి కరెంటు పోవడంతో ఉక్కపోతతో నిద్ర పట్టడం లేదని వాపోతుయారు. చివరకు రాత్రి 1:30గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ఆందోళన సద్దుమనిగింది.

విద్యుత్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న వినియోగదారులు

రాజేంద్రనగర్ సర్కిల్‌లోనూ..

నగర శివారు ప్రాంతమైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి 11గంటల సమయంలో సుమారు గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లోడ్ పెరిగిపోవడంతో కాయిల్ పేలిపోయి అంతరాయం కలిగిందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగదారులు మాత్రం అర్ధరాత్రి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఏమిటని మండిపడుతున్నారు. చాలా మంది ఆన్‌లైన్ వేదికగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలా ఒకటి, రెండు చోట్ల మాత్రమే కాదు గ్రేటర్ వ్యాప్తంగా 9 సర్కిళ్ల పరిధిలో ప్రతి రోజు పగటి వేళల్లోనే కాకుండా రాత్రి వేళల్లోనూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వాపోతున్నారు.

మరమ్మతుల పేరిట..4 గంటలు కోత

విద్యుత్ శాఖలో నిర్వహణ, మరమ్మతుల పేరిట విద్యుత్ సరఫరాను ఉదయం 2 గంటలు, మధ్యాహ్నం 2 గంటలు నిలిపి వేస్తున్నారు. అసలే వేసవి కాలం కావడంతో పగటి పూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిర్ణీత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేసి చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర పనులు చేపడుతున్నారు. అయితే పొద్దంతా కరెంటు లేక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు.., రాత్రి సమయంలోనూ కరెంటు కోతలు విధించడంతో కంటిమీద కునుకులేకుండా పోతుందని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొంటున్నారు.

నేటి నుంచి 31 వరకు సహకార సంఘాల ఎన్నికలు

షాబాద్, జూన్ 2 : రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి 31వ తేదీ వరకు సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు రంగారెడ్డిజిల్లా సహకార సంఘాల అధికారి ధాత్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు, ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలు, కల్లు గీత కార్మికుల సహకార సంఘాలు, గృహ నిర్మాణ సహకార సంఘాలు, ఉద్యోగుల, మహిళా పరస్పర సహాయక సహకార సంఘాల ఎన్నికలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

వర్ష బీభత్సం

- విరిగిపడ్డ చెట్లు.. వరదలో కొట్టుకుపోయిన కారు
- పిడుగుపడి ఎద్దు మృతి

పెద్దేముల్, జూన్ 2 : పెద్దేముల్ మండల కేంద్రంతోపాటు గాజీపూర్, బుద్దారం, కందనెల్లితండా, మారేపల్లి, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్, నాగులపల్లి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. బుద్దారం గ్రామ సమీపంలో తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారి మార్గమధ్యంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టు విరిగిపడింది. దీంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు కలిసి ఆ చెట్టును రోడ్డుపై నుంచి తొలగించడంతో మార్గం సుగమమైంది. మండలంలో వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో వృద్ధులు, చిన్నారులు ఊపిరి పీల్చుకున్నారు.

షాబాద్ : మరియాపురంలో కొబ్బరిచెట్టుపై పడ్డ పిడుగు

వికారాబాద్ : వరద నీటిలో కొట్టుకుపోతున్న కారు

పెద్దేముల్ : బుద్దారం గ్రామ సమీపంలో గాలివాన బీభత్సానికి రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

వికారాబాద్ : ప్రాణాలతో బయటపడ్డ నలుగురు

వికారాబాద్ : పిడుగుపడి మృతిచెందిన ఎద్దు

కొబ్బరి చెట్టుపై పిడుగు

షాబాద్ : కొబ్బరిచెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగిన సంఘటన షాబాద్ మండలంలోని మరియాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడడంతో మరియాపురం గ్రామానికి చెందిన ఆదూరి అగస్త్యన్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి ఇంటి పక్కన ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. దీంతో మంటలు చెలరేగి చెట్టు పూర్తిగా ధ్వంసమైంది.

తప్పిన ప్రమాదం

వికారాబాద్ : వరదనీటిలో కారు కొట్టుకుపోగా.. నలుగురు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు. పరిగి మండల పరిధిలో మల్కాపూర్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో బంట్వారం మండలం నాగ్వారం గ్రామంలోని ఓ దావత్‌కు హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. వర్షంలో స్వగ్రామం మల్కాపూర్‌కు బయలుదేరి వెళ్తున్నారు. అదే సమయంలో నాగ్వారం వాగులో నీటి ప్రవాహం పెరిగింది. ఇది గమనించకుండా వెళ్లిన కారు వరద నీటిలో చిక్కుకుపోయింది. బయటకు తీసేందుకు ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వరద నీరు ఎక్కువగా రావడంతో కారు వాగులో కొట్టుకుపోయింది. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు వాగు అంచున బయటపడి ప్రాణాలు కాపాడుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వికారాబాద్ మండలం జైదుపల్లి గ్రామానికి చెందిన బక్కి రాములు పొలం వద్ద ఎద్దును కట్టేశారు. వర్షం కురుస్తుండటంతో పక్కనే ఉన్న గుడిసెలోకి వెళ్లాడు. ఒక్కసారిగా పిడుగు పడడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రైతు కన్నీటిపర్యాంతమయ్యాడు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 2 : జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, రైతులను మోసం చేస్తే సహించేది లేదని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2లక్షల43వేల ఎకరాల్లో పత్తి పంట సాగు అయ్యే అవకాశముందన్నారు. జిల్లాలో 540 ఫెర్టిలైజర్ షాపులుండగా.. అన్ని షాపుల్లో స్టాక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 5లక్షల42వేల సీడ్ ప్యాకెట్‌లు అవసరముందని.. 3లక్షల12 వేల విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఏ కంపెనీ విత్తనాలైనా వాడవచ్చని.. ఎరువులు, విత్తనాలకు ఎలాంటి కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇంకనూ ఎక్కువ విత్తనాలు అందుబాటులో ఉంచడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని.. విత్తనాల విషయంలో ఏమైనా సందేహాలుంటే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీలర్లందరూ విత్తన చట్టానికి లోబడి, నిబంధనలను అనుసరిస్తూ వ్యాపారం నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాల విక్రయాలు చేయరాదని కలెక్టర్ తెలిపారు.

ఎల్లలు దాటిన అభిమానం

అమెరికాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

తెలంగాణ ప్రవాస భారతీయులతో కలిసి అవిర్భావ దినోత్సవంలో లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జూన్ 2 : తెలంగాణ రాష్ట్రంతోపాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఉన్న అభిమానం ఎల్లలు దాటింది. ఆదివారం తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా అమెరికా ఆటా మహాసభల్లో పాల్గొనడానికి వెళ్లిన సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఆ దేశంలోని మిన్నేసోటా నగరంలో ఉన్న తెలంగాణవాసులతో (ఎన్ఆర్ఐ) కలిసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధనలో అమరులైన వారికి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ఉద్యమాలు, ఎందరో అమరువీరుల త్యాగాలతో రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పోరాటాలు చేసిన ఉద్యమకారులు, కళాకారులు, కవులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రవాస భారతీయులు సుభాశ్‌రెడ్డి, రఘుపాల్‌రెడ్డి ఉన్నారు.

ఓఆర్ఆర్‌పై.. టోల్ చార్జీలు పెంపు

సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డుపై కొత్త వార్షిక సంవత్సరమైన ఏప్రిల్ 1-2024 నుంచి మార్చి 31, 2025 వరకు అమల్లో ఉండేలా ధరలను పెంచాల్సి ఉన్నా, దేశవ్యాప్తంగా ఎన్నికలు ఉండడంతో టోల్ చార్జీలను పెంచలేదు. ఎన్నికల ప్రక్రియ జూన్ 1న ముగియడంతో 3 నుంచే టోల్ చార్జీలను పెంచుతున్నామని ఓఆర్ఆర్ నిర్వహణ సంస్థ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ఆదివారం ప్రకటించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఏటా పెంచే టోల్ చార్జీల నిబంధనల మేరకు ఓఆర్ఆర్‌పై కొత్త టోల్ చార్జీలు అమలు చేయనున్నారు. నగరం చుట్టూ 158 కి.మీ పొడవున్న ఓఆర్ఆర్‌పై 22 చోట్ల ఇంటర్‌చేంజ్‌లున్నాయి. వాహనాల కేటగిరిని బట్టి కి.మీకు 9పై. చొప్పున పెంచనున్నారు.

కరెంట్ కోత.. ఉక్కపోత..

నిద్రపోవుడెట్లా..?

మంచాల, జూన్ 2 : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని జాపాల, బోడకొండ, లోయపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం నాలుగు గంటలకు కరెంట్ పోయి రాత్రి పది గంటలైనా రాలేదు. దానిని పరిష్కరించాల్సిన అధికారులూ ఏమి పట్టనట్లు వ్యవహరించారు. విద్యుత్తు అధికారులకు ఫోన్ చేస్తే అదేపనిగా బిజీటోన్ వస్తున్నదని.. దీంతో ఎవరికీ చెప్పాలో తెలియక నిద్ర మానుకొని ఇండ్ల ముందు ఉన్న అరుగులపై కూర్చోవాల్సి వచ్చిందని ఆయా గ్రామస్తులు విద్యుత్తు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

విద్యుత్ పోవడంతో ఉక్కపోతకు ఇంట్లో ఉండలేక అరుగుపై కూర్చున్న గ్రామస్తులు

మాదాపూర్‌లో బైక్ రేసింగ్

- 50 మంది అరెస్టు.. 50 వాహనాలు సీజ్
- రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

శేరిలింగంపల్లి, జూన్ 2 : మితిమీరిన వేగంతో దూసుకుపోతూ.. రహదారులపై ప్రమాదభరితంగా స్టంట్స్ చేస్తూ.. తోటి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ.. బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న వారిపై సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఐటీ కారిడార్‌లోని టీ హబ్ పరిసర ప్రాంతాల్లో రాత్రిళ్లు ఈ తరహా బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న 50 మంది యువకులను అదుపులోకి తీసుకొని సదరు వాహనాలను సీజ్ చేశారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపిన వివరాల ప్రకారం..

రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాదాపూర్ టీ హాబ్, ఐటీసీ కోహినూర్, నాలెడ్జి పార్క్, సత్వ బిల్డింగ్, మైహోం భుజా ప్రాంతాల్లోని రహదారులపై రాత్రిళ్లు ముఖ్యంగా వారంతంలో యువకులు బైక్ రైసింగ్‌లకు పాల్పడుతున్నట్లు సైబరాబాద్ పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీల అదేశాల మేరకు శనివారం రాత్రి పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న 50 మంది యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 50 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని 336, 341, 184 మోటర్ వెహికల్ యాక్టు కింద కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. ఒక్కో బైక్ రూ.80,000 నుంచి దాదాపు 6 లక్షల వరకు ఖరీదు చేసే స్పోర్ట్స్ వాహనాలు ఉన్నట్లు తెలిపారు.

గతంలోనూ కేసులు నమోదు

రహదారులపై ప్రమాదభరితంగా విన్యాసాలు చేస్తూ రేసింగ్‌లకు పాల్పడుతున్న వారిపై గతంలోనూ కేసులు నమోదు చేసి యువకులకు కౌన్సెలింగ్ సైతం ఇచ్చినట్లు డీసీపీ అన్నారు. సరైన డాక్యుమెంట్లు, వాహనాలకు నంబరు ప్లేట్లు లేకుండా, రిజిస్ట్రేషన్లు లేకుండా బైక్ రేసింగ్‌లకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువకులు ఈతరహా బైక్ రేసింగ్‌లకు పాల్పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాదాపూర్ అడిషన్ డీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.